90 వేల మందికి రూ.218.01 కోట్ల లబ్ధి


వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో మహిళలు

- భీమిలి నియోజకవర్గంలో వెల్లివిరిసిన మహిళా సాధికారత
- ముగిసిన వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు


సంగివలసలో మహిళలకు ఆసరా చెక్కు అందిస్తున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనలో భీమిలి నియోజకవర్గంలో మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనిస్తున్నారు. 2019 నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి అంతా మహిళల ఖాతాల్లోకి నేరుగా వెళ్లడం ద్వారా ఇప్పుడు వారంతా వివిధ వ్యాపార రంగాల్లో రాణిస్తున్నారు. ముఖ్యంగా అమ్మఒడి, కాపు నేస్తం, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, చేయూత, ఈబీసీ నేస్తం, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాల ద్వారా ఈ అయిదేళ్లలో లక్షలాది రూపాయలు వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. దీంతో వారి కుటుంబాలను సక్రమంగా నడిపించడంతోపాటు కొత్తగా వ్యాపారాలు చేపడుతున్నారు. వీటిలో మేకల పెంపకం, కిరాణా, దుస్తుల వ్యాపారం, టైలరింగ్, ఫ్యాన్సీ, పాల వ్యాపారం, ఎంబ్రాయిడరీ, పేపర్ ప్లేట్ల తయారీ రంగాల్లో ప్రవేశిస్తున్నారు. గత ప్రభుత్వాల హయాంలో చేతిలో చిల్లిగవ్వ లేక అప్పుల కోసం వెంపర్లాడే కాలం నుంచి ఇప్పుడు పొదుపు, పెట్టుబడుల ద్వారా గౌరవంగా బతుకుతున్నారు. ఇటీవల భీమిలి నియోజకవర్గంలో ప్రారంభమైన వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. 9,064 స్వయం సహాయక సంఘాల ద్వారా 90 వేల మంది మహిళలు నాలుగు విడతలుగా ప్రభుత్వం నుంచి రూ.218.01 కోట్ల లబ్ధి పొందారు. ఈ మొత్తాలను వివిధ మార్గాలలో వినియోగంలోకి తీసుకుని రావడం ద్వారా ప్రతి మహిళ ఆర్థిక స్వాతంత్ర్యం పొందారు.

జీవీఎంసీ జోన్/ మండలం	స్వయం సహాయక సంఘాలు	మొత్తం సభ్యులు	వైఎస్సార్ ఆసరా ద్వారా లబ్ధి
భీమిలి	815	8,538	రూ.26,84,00000
పద్మనాభం	1186	15,575	రూ.43,98,00000
ఆనందపురం	1293	13,701	రూ.41,80,00000
జోన్–1భీమిలి (1,2,3,4 వార్డులు)	1251	12,857	రూ.37,93,91945
జోన్–2 మధురవాడ (5,6,7,8 వార్డులు)	1401	14,013	రూ.44,26,00000
జోన్–8(89,90,91, 92 వార్డులు)	2520	25,200	రూ.23,20,04924
మొత్తం	8,466	89,884	రూ.218,01,96,869

సంక్రాంతిలా ఆసరా ఉత్సవాలు



సంక్రాంతి ముగిసిన పక్షం రోజుల్లోనే వైఎస్సార్ ఆసరా ఉత్సవాలను మరో సంక్రాంతిలా జరిపించాము. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి కారణంగా సంక్షేమ పథకాల విషయంలో మహిళలకు పెద్దపీట వేశారు. దీంతో మహిళలు పెద్ద ఎత్తున ఆయన చిత్రపటాలకి క్షీరాభిషేకాలు చేశారు. అందరికీ విందు భోజనాలు కూడా ఏర్పాటు చేయగలిగాం.

– ముత్తంశెట్టి శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే

భారత నౌకాదళం సేవలు నిరుపమానం


ఒప్పంద పత్రాలు అందుకుంటున్న ప్రతినిధులు

కొమ్మాది: దేశ రక్షణకు భారత నౌకాదళం అందిస్తున్న సేవలు నిరుపమానమని, వారి కుటుంబాలకు అండగా ఉంటామని... ముఖ్యంగా నౌకాదళంలో పని చేసేవారి సేవలకు గుర్తింపుగా నామమాత్రపు ఫీజుతో వారి పిల్లలకు గీతంలో విద్యాభ్యాసం చేసేందుకు అవకాశం అందిస్తున్నట్లు గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీ భరత్ పేర్కొన్నారు. భారత నౌకాదళానికి చెందిన నేవీ వెల్ఫేర్ అండ్ వెల్‌నెస్ అసోసియేషన్‌తో శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు పనంగా పెట్టి పోరాడే నౌకాదళ కుటుంబాలకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావించి ముందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తూర్పు నౌకాదళం పర్సనల్ సర్వీసెస్ కంట్రోలర్, వైస్ అడ్మిరల్ గురుచరణ్ సింగ్, ఐఎన్ఎస్ కళింగ కమాండర్ ప్రదీప్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యం పెంపొందించాలి


హెచ్‌ఎంలకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంఈవో రమణ

పద్మనాభం: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మరింత పెంపొందించాలని ఎంఈవో పి.రమణ సూచించారు. మండల విద్యా శాఖ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలన్నారు. వర్కుబుక్కు ఎప్పటికప్పుడు సరిదిద్దాలని సూచించారు. ఈ నెల 9న పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో రమణ, వైద్య ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు నులి పురుగల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. సమావేశంలో సీఆర్పీలు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం పరిశీలన


చిట్టివలస అగ్నిమాపక కేంద్ర సిబ్బందితో డ్రిల్ చేయిస్తున్న డీఎఫ్‌వో రేణుకయ్య

తగరపువలస : జిల్లా అగ్నిమాపక శాఖాధికారి ఎస్.రేణుకయ్య శనివారం తాళ్లవలస జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న చిట్టివలస అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. సిబ్బందితో కేంద్రం ఆవరణలో డ్రిల్ చేయించారు. సిబ్బందికి కొన్ని సూచనలు చేస్తూ ప్రమాదాల పట్ల నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఆయనకు స్థానిక అగ్నిమాపకశాఖాధికారి జి.శ్రీనివాసరావు, సిబ్బంది వీడ్కోలు పలికారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


మామిడిపాలెంలో వాటర్ ట్యాంకుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు మామిడిపాలెంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పరిష్కారం చూపించి రూ.14 లక్షలు మంజూరు చేశారని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి అన్నారు. మామిడిపాలెంలో 3 వేల లీటర్ల సామర్థ్యం గల మూడు వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఇక్కడి ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా గతంలో గ్రామస్తులను టీడీపీ నాయకులు మోసం చేశారన్నారు. గ్రామస్తులకు 24 గంటలూ తాగునీరు అందించేలా తాము చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు చిల్ల బాబయ్యరెడ్డి, చేట్ల శ్రీనివాసరెడ్డి, చిల్ల గణేష్ రెడ్డి, బొండా కిరణ్, వంశీరెడ్డి, బోర వెంకట అప్పారావు, జీరు భరత్‌రెడ్డి, కర్రి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్దపీట

- భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- 98వ వార్డులో రూ.77.36 లక్షల పనులకు శంకుస్థాపన


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 98వ వార్డు అడవివరంలో రూ.77.36 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. శిడగంపేటలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆవిష్కరించారు.

చేపట్టనున్న పనుల వివరాలు

- అడవివరం ప్రభుత్వ ఆస్పత్రి వెనుక నుంచి స్వామి కల్యాణ మండపం వరకు రూ.19.75లక్షలతో సీసీ రోడ్లు, సీసీ కల్వర్టు నిర్మాణం
- ఆకులవీధిలో రూ.12.68 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ కల్వర్టు
- రూ.14.75లక్షలతో గాంధీనగర్‌లో సీసీ రోడ్డు, సీసీ కల్వర్టు నిర్మాణం
- రూ.13.70లక్షలతో టీవీ టవర్ కాలనీలో సీసీ రోడ్డు, సీసీ కల్వర్టుతో పాటు రూ.16.50లక్షలతో హరిహరానందనగర్‌లో బీటీ రోడ్డు పనులకు ముత్తంశెట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, వైఎస్సార్‌సీపీ 98వవార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, వైఎస్సార్‌సీపీ నాయకులు లంక సత్తిబాబు, దొంతల సంతోష్, శిడగం తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో పింఛన్లు అందజేత


కేజీహెచ్‌లో పింఛన్ నగదు అందిస్తున్న వెల్ఫేర్ కార్యదర్శి గోపి

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు 68వ నంబరు సచివాలయం పరిధిలోని లబ్ధిదారునికి వెల్ఫేర్ కార్యదర్శి గోపి, సచివాలయ కన్వీనర్ డి.అప్పారావు కేజీహెచ్‌కు వెళ్లి ఇద్దరు లబ్ధిదారులకు పింఛన్ నగదు అందించారు. స్వతంత్రనగర్‌కు చెందిన ఎల్.మోహన్‌రావు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో వీరు అక్కడికి వెళ్లి పింఛన్ అందించారు. అలాగే ఇదే ప్రాంతానికి చెందిన మరో లబ్ధిదారు లంబాడ రామలక్ష్మి కూడా అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో ఆమెకు కూడా పింఛన్ నగదు అందించారు. దీంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రుచికరంగా 'జగనన్న గోరుముద్ద' అమలు

పరిశీలించిన కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


చంద్రంపాలెం హైస్కూల్‌లో భోజనం చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పీఎం పాలెం: జీవీఎంసీ 6వ వార్డులోని చంద్రంపాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం అమలవుతున్న తీరును కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం మధ్యాహ్నం పరిశీలించారు. అక్షయపాత్ర ఫౌండేషన్ నిర్వాహకులు సరఫరా చేసిన చక్రపొంగలి, పులిహోర తదితర ఆహార పదార్థాల నాణ్యత, రుచి పరిశీలించి భోజనం చేశారు. అనంతరం కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకాన్ని నాణ్యంగా, రుచికరంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయంలో రాజీ పడడం లేదన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాన్య, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి సీఎం జగన్ మోహన్ రెడ్డి కంకణం కట్టుకున్నారన్నారు. అలాగే అందరికీ మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడానికి ఊరూరా ప్రభుత్వ ఆస్పత్రులు ద్వారా సేవలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వారితోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పోతిన శ్రీనివాసరావు, బొట్ట అప్పలరాజు, కృష్ణమూర్తి పాత్రుడు, పోతిన యల్లాజీ, సూరిబాబు, కుడితి రామారావు, జామి శివ ఉన్నారు.

సామూహిక సౌందర్యలహరి పారాయణ


సామూహిక సౌందర్యలహరి పారాయణ చేస్తున్న భక్తులు, పాఠశాల సిబ్బంది

మధురవాడ: కొమ్మాది విజయం స్కూల్‌లో శనివారం సామూహిక సౌందర్యలహరి పారాయణ చేశారు. ఆధ్యాత్మికవేత్త, సౌందర్యలహరి పారాయణ ప్రచారకర్త సుందరి పద్మావతి ఆధ్వర్యంలో పలువురు భక్తులు, పాఠశాల సిబ్బంది సౌందర్యలహరి, లలితా సహస్ర నామ పారాయణ చేశారు. సీతమ్మధార వినాయక గుడి వారాణి అమ్మవారి పీఠాధిపతి వామన శర్మ, ప్రచారకర్తలు పద్మిని కుమారి, సావిత్ర, శారద తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మోటివేషన్ తరగతులు

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య విద్యార్థులకు అకడమిక్ కెరీర్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌పై రెండు రోజులపాటు నిర్వహించిన మోటివేషన్ తరగతులు శనివారం ముగిశాయి. మోటివేషన్ స్పీకర్ డాక్టర్ జగన్నాథరావు, రిసోర్స్‌పర్సన్ డాక్టర్ రావు విద్యార్థులకు అకడమిక్ గ్రోత్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ నైపుణ్యాలపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన జెడ్సీ శైలజవల్లి



భీమునిపట్నం: భీమిలి జోనల్ కమిషనర్‌గా జి.శైలజవల్లి శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన జెడ్సీ రాము మండపేటకు బదిలీకాగా, ఈమె రాజమండ్రి గ్రేడ్ – 1 కమిషనర్‌గా పని చేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

9 నుంచి యోగా తరగతులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థూలకాయ నివారణకు ఈ శిబిరం 8 వారాల పాటు జరుగుతుందన్నారు. రోజూ ఉదయం 6 నుంచి 8.15 వరకు శిక్షణ తరగతులు ఉంటాయని, 91678 89881, 70970 99900లో సంప్రదించాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే శిష్టకరణాల అభ్యున్నతి


పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న శిష్టకరణాల సంఘం ప్రతినిధులు

తగరపువలస: వైఎస్సార్‌సీపీతోనే శిష్టకరణాల అభ్యున్నతి సాధ్యమవుతుందని ఏపీ శిష్టకరణాల సంఘం మహిళ అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి పట్నాయిక్ అన్నారు. శనివారం సాయంత్రం రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు దొంకాడ అనిల్ కుమార్‌తో కలిసి పేద మహిళలకు ఆమె చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలతోపాటు నామినేటెడ్ పదవుల్లో బీసీలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీయే అన్నారు. అనంతరం శిష్టకరణ యువత నాలుగేళ్లలో నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించి ప్రత్యేక సంచికను తొలిసారిగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికతోట చంద్రమౌళి, శివ, యూత్ అధ్యక్షుడు మానాపురం సురేష్, పీఎం పాలెం సేవా సంఘం ఉపాధ్యక్షురాలు దొంకాడ వసంత, ప్రధాన కార్యదర్శి మండవకురిట లక్ష్మి, రమేష్‌బాబు, బాసూరి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, సూరప్పడు, బింగి హరికిరణ్‌రెడ్డి, మానాపురం శివసాయికుమార్, ఉపాధ్యాయుడు జి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ


గెద్దపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పద్మనాభం: మండలంలోని కోరాడ పంచాయతీ గెద్దపేటలో పాఠశాల విద్యార్థులు కుష్టు వ్యాధిపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా పాఠశాల, గ్రామంలో బ్రెటైర్ ఫ్యూచర్ డవలప్‌మెంట్ సంస్థ సభ్యులు సమావేశం నిర్వహించి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. సంస్థ డీసీవో వి.గురునాథరెడ్డి మాట్లాడుతూ శరీరంలో స్పర్శ లేని మచ్చలు ఉంటే కుష్టు వ్యాధిగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : కుష్ఠి వ్యాధిపై అవగాహన కలిగిస్తూ స్థానిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆనందపురంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గంగునాయుడు మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని మచ్చలు, చెవి, వీపు, ఎదపై నొప్పిలేని బొడిపెలు కనిపిస్తే వైద్యులకు చూపించుకుని చికిత్స పొందాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా మందులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యురాలు షహనాజ్ సాదియా, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

16 కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. పోలీస్ కమిషనర్ డా.రవిశంకర్, అడిషనల్ కమిషనర్ నాగేంద్రుడు (స్పెషల్ బ్రాంచ్) ఆదేశాల మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ విశాఖ ఐ హాస్పిటల్ వద్ద శనివారం నలుగురు వ్యక్తులు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.త్రినాథ్ తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఆ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించిన నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా.. వారి వద్ద 16 కిలోల గంజాయి, రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ద్వారకా పోలీసులకు అప్పగించారు. ద్వారకా సీఐ రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ కె.మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గుడిలోవలో సమితి స్థాయి ఆటల పోటీలు


ఆటల పోటీల్లో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు

ఆనందపురం : మండలంలోని గుడిలోవలో ఉన్న విజ్ఞాన్ విహార్‌లో రెండు రోజులుగా గుడిలోవ సమితి స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 252 మంది విద్యార్థులకు నిర్వహించారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు విజయవాడలో ఆగస్టులో జరగనున్న జోనల్ స్థాయి ఆటలు పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

సంపూర్ణ రామాయణం నాటకం నేడు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో సంపూర్ణ రామాయణ నాటకం ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రదర్శించనున్నారని ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ ఓ ప్రకటనలో తెలిపారు. మందిర భక్త బృందం నాటకం ప్రదర్శిస్తారని తెలిపారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు పూర్తి

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: భీమిలి మండలం పాత మూలకుద్దులో పగిలిన పైప్‌లైన్‌కు ఎట్టకేలకు కాంట్రాక్టర్ శనివారం మరమ్మతులు పూర్తి చేశాడు. సంక్రాంతికి ముందు ఇక్కడ పైప్‌లైన్ పగిలిపోయినా చేపలుప్పాడకు చెందిన టీడీపీ కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో గత నెల 30న 'నెల రోజులుగా తాగునీరు వృథా' శీర్షికతో సాక్షిలో ప్రచురించిన వార్తకు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకొచ్చి మరమ్మతులు పూర్తి చేయించారు. జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయిలు కూడా పూర్తి చేయాలని పాత మూలకుద్దు గ్రామ ప్రజలు కోరుతున్నారు.

సాగర్ దీక్ష పోస్టర్ ఆవిష్కరణ


పద్మనాభం: సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ విశాఖపట్నంలో ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న విశాఖ సాగర సంగ్రామ దీక్ష పోస్టర్‌ను ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు శనివారం పద్మనాభం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు అవనాపు అరుణ్ కుమార్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు గౌరినాయుడు, గణేష్, చిన్నారావు, మురళి, మోహన్‌బాబు పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సముద్ర తీర ఉత్సవం


ఉత్సవంలో బెలూన్స్ వదులుతున్న దృశ్యం

కొమ్మాది : విజ్ఞాన నైపుణ్యాలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లో యువతను ప్రోత్సహించడానికి ఏటా షోర్ ఫెస్ట్ పేరిట గీతం వర్సిటీ నిర్వహించే సముద్ర తీర ఉత్సవం శనివారం రుషికొండ తీరంలో అట్టహాసంగా ప్రారంభమైంది. ఇక్కడ తీర ప్రాంత పరిశుభ్రత ప్రాధాన్యతను తెలిపే విధంగా అవగాహన కల్పించారు. అదేవిధంగా సముద్ర ప్రాణులను రక్షించుకోవడం అనే అంశంపై గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ వివరించారు. ఉత్సవాల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని బెలూన్స్ విడిచిపెట్టారు.

యూపీహెచ్‌సీకి కుర్చీలు అందజేత


కుర్చీలు అందజేస్తున్న పార్వతి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో గల యూపీహెచ్‌సీకి సామాజిక సేవా కార్యకర్త, వైఎస్సార్‌సీపీ నాయకురాలు పార్వతి 20 కుర్చీలు శనివారం అందజేశారు. ఇక్కడకు వచ్చిన రోగులకు ఇబ్బంది కలగకుండా కుర్చీలు అందజేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు లొడగల రామ్మోహన్, అల్లాడ ఉమా మహేశ్వరరావు, మాదు చంటి, సకల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.